# మనసున ముగ్గులు

బి.లలిత



రాజా ఇల్లు వున్న కాలనీ ఎప్పుడూ నిశ్శబ్దంగా వుంటుంది. ప్రొద్దుట అయిదున్నర అయితే—మరీను. అందుకే హరి కాలనీ మొదట్లోనే మోటారు బైక్ ఇంజనాపేసి తోసుకుంటూ నడిచాడు. చిరు చీకట్లు, అక్కడక్కడా వెలుగు చారలు, ఆకాశంలో నక్షత్రాలు పాలిపోతున్నాయి.

చీపుళ్ళ చప్పుడు, అక్కడక్కడా కుక్కల అరుపులు దూరంలో స్టేషను నుండి బయలుదేరిన ఎలక్ట్రిక్ ట్రైన్ కూత—రాజా యింటి కాంపౌండు గేటు తెరిచే వుంది.లోపలికి "మోటార్ బైక్"తో సహా ప్రవేశించి వాహనానికి స్టాండ్ వేసి ఇంటివైపు తిరిగి—ఆగిపోయాడు.

గుమ్మం ముందు అందంగా కళ్ళాపి చల్లి వుంది. పొడుగాటి, తలంటు పోసుకున్న వెంట్రుకలని వేలు ముడేసుకుని, తెల్లటి ఎర్రంచు చీర, తెల్లరవికలతో మునివేళ్ళ మీద కూర్చుని, సన్నటి తెల్లటి వేళ్ళనుంచి ముగ్గు జారుతుంటే కళ్ళాపి చల్లిన నేలమీద అందాల ముగ్గులకి రూపం పోస్తున్న అమ్మాయి—అందమైన అమ్మాయి వుంది.

పొడుగ్గా, హుందాగా కన్పిస్తున్న కంఠం నుంచి తమిళగీతం, 'మార్గళి' మీద ఆండాళ్ పాట వెలువడుతోంది. వుండి వుండి పాట ఆపేసి రాగం తీస్తూ ముగ్గు వేస్తోంది ఆ అమ్మాయి.

చెయ్యి జాపి ఆ చివరికి గీతని గియ్యడంలో ముందుకి వంగుతూ—రాగంలో ఊపిరందక ఆయాసపడి తలెత్తి చూసింది. ఆ పెద్ద పెద్ద కళ్ళని, వాటిమధ్య పొడుగైన ముక్కు—మీద మెరిసిన ముక్కుపుడకని—దానికింద ముద్దు పెట్టుకోవాలనిపించచేసే చిన్న నోరుని చూసి ఏం మాట్లాడాలో తెలీక, తెలిసినా కొయ్యబారిపోయి అలా మోటారు బైక్ నానుకుని నిలబడిపోయాడు హరి.

ఆ అమ్మాయి ముందుకు పడ్డ పొడుగాటి వెంట్రుకలని బుగ్గమీద నుంచి మణికట్టుతో తోసుకుంటూ లేచి నిలబడింది.

"అన్నయ్య లోపలున్నాడు." అంది, ఇంగ్లీషులో! హరి అలాగే నిలబడ్డాడు. ఆ కంఠం ఎంతబాగుంది, శ్రావ్యంగా, మెత్తగా, తియ్యగా... ఆ చిన్న పైపెదవిని కొరుక్కుంటూ, ముగ్గు గిన్నె దాచేస్తున్నట్టు వెనకగా పట్టుకుని—మణికట్టుతో ఆ నల్లటి జుత్తుని వెనక్కి తోసుకుంటూ, దేవతలా తోచింది.

"రాజాకోసమేగా వచ్చారు?" ఆ కంఠంలో విసుగు, ఆశ్చర్యంతోబాటు. ఉలిక్కిపడి—తలూపి లోపలికి కదిలాడు. ఆమె పక్కనుంచి వెళ్తుంటే వొక వింత పరిమళం తోచింది. ఇంటి మెట్లెక్కుతూ వెనక్కి తిరిగాడు హరి.

తనవైపే చూస్తోంది — ముగ్గుగిన్నెలో వ్రేళ్ళున్నాయి. మళ్ళి మునివేళ్ళ మీద కూర్చుంది. ఆ నల్లటి నేలమీద తెల్లటి ముగ్గులూ, అంతకంటే బాగున్న అమ్మాయీ — హరికిదేదో గొప్ప అనుభవమనిపించింది — యింకేదో గొప్ప విషయానికి నాందిగా తోచింది.

"మీ ముగ్గూ, మీ పాటా, మీరూ చాలా బాగున్నారు" అన్నాడు లోపలికివెళ్తూ

…అంగ. రాజు గదిల సోఫాలో, తన ఆరడుగుల శరీరాన్ని పడవేస్తూ అన్నాడు "రాజూ-నీకు తెల్లారగట్టే లేచి ముగ్గులెట్టే చెల్లెలుందని తెలీదురా" రాజు తల దువ్వు కుంటూ వెనక్కి తిరిగాడు. "మహి యేనా? అదో సరదా దానికి ఇల్లంతా సర్దడం — పనిలేనపుడు వీణ ప్రాక్టీసు, కాలేజి మానే సింది – ఏదో పని చెయ్యాలిగా..."

"కాలేజీ చదువయిపోయిందా? పది హేడేళ్లు కూడా వున్నట్టు లేవు?" హరి కుతూహలంగా అడిగాడు. "నాన్నగారు పోయినపుడు – వేసంగి సెలవుల్లో పోయా రుగా — పి.యూ.సీ అయింది. బి.ఏ. లో చేరలేదు. నాకిష్టం లేదంది. నేనూ సరే నన్నాను. వచ్చేఏడాది చూసుకోవచ్చుని. ట్వైవూ, షార్ట్‌హాండూ, ఫ్రెంచ్ వగైరా వగైరా వెలిగిస్తోంది."

"కంఠం బాగుందిరా — చాలా బాగా పాడుతోంది—" హరి మెల్లిగా అన్నాడు. "మా మహి కంఠంకేరా — అచ్చం లతా మంగేష్కర్..." రాజు లేచి నిలబడ్డాడు "నేను రడీ" అంటూ. హరి లేచాడు, "మహి దేనికిరా షార్టు?" రాజు హరికేసి పరిశీలనగా చూసాడు. "నీకెందుకు?" అన్నాడు సూటిగా.

హరి తికమక పడ్డాడు.

ఆ ముగ్గుల మధ్య దేవతలాగ కన్పిం చిందిరా — ముక్కుపుడకతో సహా... చాలా అందంగా వుంది-పుట్టినే...కుతూహలం..."

"ఆ ముక్కు పుడక దేవత..." మహి పూర్తి పేరు ఉమామహేశ్వరి. ఏదో చీరకడితే ఆ భారత నారి వేషం వేస్తుంది — లేకుంటే అదీ-పాంట్, సూట్స్ — యాక్సీలు — నాన్న గారు పోకముసుపు హాట్ పాంట్స్ కూడా ట్రై చేసింది..." రాజు హరి ముఖంలోని అప నమ్మకాన్ని చూసి నవ్వుకున్నాడు.

"మా చెల్లెలిని డిస్కస్ చేస్తూ యిక్కడే వుండిపోదామా — కదిలే ఆలోచనేమన్నా వుందా?" హరి అయిష్టంగా కదిలాడు.

వాకిట్లో ముగ్గులు పూర్తయ్యాయి — బంతి పువ్వులున్న గొబ్బెమ్మలు — "మీ చెల్లి చాలా కెలిబియస్సా?" అడిగేసి నాలిక్కరు చుకున్నాడు హరి. "అదో ఫోజు" రాజు …టాపిక్ మార్చేశాడు.

రోజంతా కంచిలో స్నేహితుడి పెళ్లి హడావుడిలో గడిపి రాత్రి పదింటికి తిరిగి వచ్చారిద్దరూ. "నువ్విపుడు మీ ఇంటికెళ్ళి ఏంచేస్తావు – ఎవరేనా కాచుకునుంటారా అంటే అదీలేదుగా — యిక్కడే పడుకో" అన్నాడు రాజు. హరి మోటార్‌బైక్‌ని ఆపుతుండగా "అన్నయ్యా వచ్చేశావా" అన్న సంతోషమైన పలకరింపు వినబడింది.

రాజు లోపలికి నడిచాడు. "మహీ హరి యిక్కడే పడుకుంటాడు—గెస్టురూం సర్ది పెట్టు." అంటూ. మహి మొహం ఆమాటలు వింటూ ఎలా అయిందో, అని ఆత్రపడ్డాడు హరి. ఏమనుకుంటుందో, మోటార్‌బైక్‌కి స్టాండ్ వేసి లోనికి నడిచాడు.

"పూర్తి భోజనం ఎలాగూ చెయ్యలేం, సాండ్ విచెస్ తిని టీ తాగుదాం." రాజు సజెషను యిట్టే ఒప్పుకున్నాడు హరి—పాపం లేకుంటే ఇపుడు-వండాలి కాబోలు మహి. మహిని కష్టపెట్టడం ఇష్టం లేకపోయింది హరికి.

కిచెన్‌లో టేబిలు చుట్టూ కూర్చుని టొమోటో సాండ్ విచెస్ తింటూ వేడివేడి టీ తాగుతుంటే అంతవరకూ మాట్లాడక పోయినా మహి తనకి చాలా దగ్గరయినట్టు తోచింది హరికి. మహి చేసినవి కాబట్టి, నాలుగు సాండ్ విచెస్ తిని, పంచదార ఎక్కు వయినా—టీ తాగేసి-బాగుందని జనాంతికంగా మెచ్చుకున్నాడు.

రాజు, "మహీ నో పాట పాడరాదూ" అంటే మహి ఎర్రబడింది. "నేపాడ"నంది తర్వాత, ఖచ్చితంగా. హరి కో క్షణం మహి తను అక్కడ వున్నందువల్లే పాడనంది అని పించి బాధ కలిగింది.

"రాజూ, పడుకుంటానిక" అన్నాడు. మహి కళ్ళు చిత్రంగా చూసాయి హరి వైపు. హరి వాటిని చూడలేదు.

రాత్రంతా హరి కళ్లముందు ఏిరంతు తెల్లచీరలోనూ, లేతకుపచ్చ డ్రెసింగ్ గౌనులో, మెత్తటి వెంట్రుకలు కలగా పులగంగా మొహాన్ని కప్పేస్తుంటే టీ కలుపు తున్న అమ్మాయి నిలిచింది.


ఆరింటికి— నిన్నటి కంఠమే— కలల్లోకి చీల్చుకుని వినిపించింది— "ఖిల్‌తేహై గుల్ యిహా" అంటూ. రెండో పక్కకి దొర్లి, మోచేతిమీద ఆనుకుని కిటికీలోంచి క్రిందికి చూశాడు. నందివర్ధనాలని కోసుకుంటోంది మహి—జుట్టు వీపునంతా పరదాలా కప్పేసింది. లేత నీలం మీద పువ్వులు కుట్టిన గరారా మీద వోణీ వేసుకుంది. అంత దూరానకూడా కదిలి నపుడల్లా ముక్కు పుడక మెరుస్తోంది. ముస్లిము పిల్లలాగుంది.

తోటలోకి అడుగు పెడుతూ చలికి వణి కాడు హరి— మహికోసం కళ్లతో వెతికాడు. "గుడ్ మార్నింగ్" వెనుక నుంచి విన్పించింది మహి కంఠం. "హో—హల్లో" అన్నాడు—మహి పెదవులమీద చిర్నవ్వు వెలిసింది— "మీరు త్వరగా లేచేశారు— అన్నయ్య ఎనిమిదింటికి గాని మంచం దిగడు..." మహి కంఠంలో స్నేహం ధ్వనించింది.

హరికి చాలా ఆనందంగా వుంది. చలి చలిగా, చిరు చీకట్లింకా వున్న ఉదయం—సజీవ శిల్పం లాంటి అమ్మాయి, ఆ అమ్మాయి ముఖ కవళికల్లో, మాటల్లో స్నేహం...

"నాకూ అలవాటు లేదు ఎర్లీగాలేవడం— మీ పాటే లేపేసింది" చిర్నవ్వుతో అన్నాడు "సారీ చెప్పనా?" మహి కొంచెం ఎత్తు…న కొమ్మ అందక అవస్థపడుతూ అంది.

హరి చేతితో అందుకుని రెమ్మని వంచాడు. మహికి "థాంక్స్ చెప్పాలి" అన్నా… … వెంట్రుకల పరదానుంచిహరిని … …



"చెప్పాలా ?" అంది జుట్టు వెనక్కి తోసు కుంటూ. హరి "వద్దులెండి" అన్నాడు.

"పెళ్లెలా జరిగింది ?" మహి పూలు

## మనసున ముగ్గులు

కొయ్యడంలో మునిగిపోయింది. "నిన్న రాజు చెప్పలేదూ?" హరి అన్నాడు— తనూ కొయ్య డానికి ప్రయత్నిస్తూ. "ఉహూఁ మీరూ వడు కుందుకు వెళ్లారు— రెణ్నిమిషాలలో తనూ వెళ్లిపోయాడు. అలిసిపోయానని."

మహి, హరి పూలు కొయ్యడాన్ని పరీక్షగా చూస్తూ నిలుచుంది. తను కోస్తున్న రెమ్మని వదిలేసి "బాగుంది—మీరలా కోస్తే, నేను నందివర్ధనం రేకలు మాలకట్టాలి. చాల్లేలు. తెంపినన్ని తెంపారుగాని" అంది. హరినవ్వాడు పూలు కోసే ప్రయత్నాన్ని వదిలేసి. మహీ నవ్వింది. తెల్లటి పలువరస తళుక్కున మెరిసింది.

హరి తోటంతా కలయ చూసాడు. "అప్పుడెప్పుడో యిక్కడే పౌర్ణమినాడు పార్టీయిచ్చాడు రాజా. రాత్రేమో, ఏం మొక్కలున్నాయో తెలియలేదు" అంటూ.

"రాజా పార్టీలు ఘనంగా యిచ్చేవాడటగా— నేనా రోజుల్లో చిన్నపిల్లని — బోర్డింగ్‌లో వుండేదాన్ని. పి. యూ. సి.లో చేరేముందరే ఇంటికి వచ్చేసాను — నిజానికి రెండేళ్లక్రితం వరకూ మా ఇల్లు యిదని, యిలాగుంటుదని తెలీదు నాకు." మహి కంఠంలో బాధ ధ్వనించింది.

"సెలవుల్లో ఇంటికి వచ్చేవారుకారా ?" హరి మృదువుగా అడిగాడు. "ఉహూఁ నాన్నారు స్కూలుకి వచ్చి తీసికెళ్ళేవారు — ఊటీ, కొడై, సిమ్లా — అన్ని వూళ్లూ తిప్పేవారు — అన్నీ చూపించేవారు. ఇంటికి మటుకు తీసికెళ్లేవారుకాదు. కాలేజీలో చేరే ముందు సమ్మర్లో యింటికి తీసుకొచ్చారు. అంతవరకూ నాకీ యింటి గురించి ఏమీ తెలీదు — అన్నయ్య కూడా స్కూలుకే వచ్చి చూసి వెళ్ళేవాడు ..." మహి హఠాత్తుగా టాపిక్ మార్చేసింది —

"పెళ్లెలా జరిగింది ?" అడిగింది మహి. "పెళ్లికేం బాగానే జరిగింది—పెళ్లికూతుర్ని చూస్తే విజయ్ మీద జాలేసింది — చేసుకోక చేసుకోక ఆ అమ్మాయినే చేసుకోవాలా అని.." హరి పెళ్లి విశేషాలు చెప్పసాగాడు. కాసేవట్లోనే యిద్దరు చిరస్నేహితుల్లా నవ్వుకోసాగారు —పెళ్లిలోని జోక్స్‌మీద.

మాట్లాడుతునే మామిడిచెట్టు కింద గచ్చుమీద సర్దుకుని కూర్చున్నారు. మహి పూలు కట్టసాగింది. మాటలాపేసి మహి వేళ్ల కదలికని గమనించసాగాడు హరి. అంత త్వర త్వరగా చకచకా కదులుతున్న ఆ సన్నటి వేళ్లని, నిముషాల్లో పెరిగిపోతున్న మాలని చూసి ఆశ్చర్యపడ్డాడు.

"నేనూ కట్టనా ?" దారాన్ని తీసుకుని రెండు పూలు ఏరాడు హరి — "వద్దులెండి పూలు కొయ్యడం చూసానుగా — పూలు ఎలా కడతారో ఊహించగలను..." కొంటి నవ్వులు చిందించింది మహి. "వద్దంటారా?" నిరాశ నిస్పృహ నటిస్తూ దారాన్ని వదిలేసాడు హరి.

"వేసంగిలో అయితే మల్లెపూలు చాలా పూస్తాయి. మాల కట్టలేక చేతులు నొప్పెట్టేవి." మహి కొసకళ్లతో హరికేసి చూసింది. పూలచుట్టూ దారాన్ని ముడి వేస్తున్న కుడిచెయ్యి ఆగిపోయింది.


**రు. 15/-లలోనే రేడియో**



మా క్రొత్త స్కీము క్రింద మీరు బ్యాటరీ సెల్సుతో పని చేసే మీడియం వేవ్‌పాకెట్ ట్రాన్సిస్టర్ పొందగలరు. పార్టులు జపాన్‌లో తయారుచేయబడినవి. సంగీతం, వార్తలు వగైరా వినండి. ఉత్తమంగా పని చేస్తుంది. పోస్టేజీ రు. 3/— వి. పి. పార్శెలు కొరకు వ్రాయండి. ఆమోదించబడకపోతే వెల వాపసు చెయ్యబడగలదు. ఇంగ్లీషులో వ్రాయండి

**BUNTY RADIOS (B. 19)**
**DURGIANA, AMRITSAR.**



తలనొప్పి లేక ఫ్లూబాధకు
అతిశీఘ్రంగా ఉపశమనం!






**శాలోఫెన్**
**బాధానివారిణి మాత్రలు**

అమృతాంజన్ లిమిటెడ్ వారి తయారీ

శాలోఫెన్ తలనొప్పి, ఫ్లూ, పంటినొప్పి, ఒళ్లు నొప్పులకు అతి నిశ్చయంగా, శీఘ్రంగా ఉపశమనం కలిగిస్తుంది. ఇది నిరపాయకరమైనది. శాలోఫెన్ డాక్టర్లు సిఫారసుచేసే పటుతైన ప్రక్రియ కలిగియుంది.

FDS/AS, 1928 TER

హరి ప్రొఫైల్ చాలా అందమైనది. గ్రీకుల ముక్కు, పట్టుదల సూచించే, ఎపుడూ నవ్వడానికి సిద్ధంగా వుండే పెదవులు, కోపం గాని బాధగాని కలిగితే వింతగా బిగుసుకునే దవడఎముకలూ, చిన్న సొట్టతో వినోద్‌ఖన్నా లాంటి గడ్డం, తిన్నగా కూర్చున్న ఎథ్లెట్ శరీరం – హరి చాలా అందమైనవాడు, అబ్బాయిలే ఒప్పుకుంటారది.

హఠాత్తుగా మహికేసి తిరిగిన హరి ఆశ్చర్యపోయాడు, మహి మొహంలోని చదవ బడని భావాలనిచూసి. నిన్ననూ ముగ్గు పెడుతూ యిలాగే చూసింది. ఈ పదహారేళ్ల అమ్మాయి ఎందుకు తనలో ఇంత కుతూహలాన్ని, ఏ అమ్మాయిని చూసినా కలగని వింత అనుభూతిని రేకెత్తిస్తోంది?

హరి యింతవరకూ చాలా అమ్మాయిలతో తిరిగాడు. వాళ్లందరి కంటే వేరులా తోచింది మహి. వయసు, అమాయకత్వం – మహిలోని స్త్రీత్వం యింకా నిద్రాణమై వుంది ఆమె యింతవరకూ ఏ మగాడి గురించీ సన్నిహితంగా ఆలోచించి వుండదు అసలామెకి బాయ్ ఫ్రెండ్సుండి వుండరు ఉలిక్కిపడుతూ తల తిప్పేసుకుంది మహి హరి మొహంలో ఆశ్చర్యం కంటే వేరే భావమేదో తోచింది మహికి తెల్లటి శంఖంలాంటి మెడనుండి మొదలయి, చెవుల చివర్లవరకూ ఎరుపురంగు పాకింది – వణికే చేతులతో మూలని పూర్తి చేసింది మహి.

కిటికీలోంచి తొంగిచూస్తూ కేకవేశాడు రాజు, "మీ రిద్దరూ రహస్యాలు చెప్పుకోడం పూర్తయితే కాఫీ తాగడానికి రండి"

టిఫిను తింటుంటే హరి స్నానం చేసి వెళ్లి పోతానన్నాడు రాజు "మధ్యాహ్నం వెళ్లవచ్చు లేవోయ్–మహి వంట యీ రోజు, మిస్సయితే బాధపడతావు" అన్నాడు. తోటలోంచి తిరిగి వచ్చాక మొదటసారిగా మాట్లాడింది మహి. "అవును టీ అయినాక వెళ్దురుగాని"

ఇద్దరూ మెట్లెక్కుతుంటే రాజు అడిగాడు "హరీ! మహి ఏం మాట్లాడుతోంది అంత సీరియస్‌గా?" హరి చెప్పాడు.

"మహి నా స్వంత చెల్లెలు కాదురా–పిన్ని కూతురు. నాన్నగారు రెండో పెళ్లి చేసుకున్నారు పిన్ని పోయేనాటికి మహికి ఆరేళ్లు కూడాలేవు నాకదంటే పిచ్చి జెలసీ–అదింట్లో వుంటే నేనుండనని పట్టుపట్టాను నాన్నగారు దాన్ని బోర్డింగులో పెట్టారు. కాని– ఆశ్చర్యంగా బోర్డింగు–నుంచి వచ్చేశాక, మహి నాకు ప్రాణమయిపోయిందిరా ఇపుడు నా జెలసీని తల్చుకుంటే ఆశ్చర్యం వేస్తుంది" రాజుకీ మహికీ పోలికలెందుకు లేవో అర్థమయింది హరికి

భోజనాలయేంతవరకూ కారమ్సు ఆడారు మహి వంట ప్రయత్నంలో వున్నపుడు మటుకు పేకాడుకున్నారు రాజూ హరీ. మహికి పేకాట రాదు! కారమ్సు మటుకు ఎక్స్‌పర్ట్. సింగిల్ హాండెడ్‌గా నాలుగు గేములు గెల్చింది. వేడి వేడిగా సాంబారూ, బంగాళాదుంపల వేపుడూ తింటూ హరి నిట్టూర్చాడు.




నేనూ నీలాగే వెంట్రుకలను పెంచానోయ్!! కాని మా అమ్మ "ఆడపిల్లలు లేని లోటును తీర్చావురా!" అని తన కోర్కెను తీర్చుకుంది...

"ఇలాంటి భోజనం అలవాటయితే కష్టం ఢిల్లీలో నాకు చప్పిడి తిండే"

"రేపు కదూ–నీ ప్రయాణం? మళ్లా వో రెండేళ్లు మొహం చూపించవు– ఉత్తరాలు రాసే సద్గుణం అసలే లేదు. అవునుగానీ హరీ. పెళ్లి వగైరా గురించి ఆలోచించావా? పాతికేళ్లు దాటేసాయిగదా.." రాజు చేయి కడుక్కుంటూ అన్నాడు

"విజయ్ పెళ్లి తర్వాత నీకూ పెళ్లి మీద కోరికా?" హరి నవ్వేసాడు. గిన్నెలని సర్దుతున్న మహి వేళ్లు వణికాయి యధాలాపంగా మహికేసి చూసిన హరికామె మొహం పాలిపోయినట్టనిపించింది

"నేను పోయి పడుకుంటాను మహీ– మూడింటికి టీ పెట్టి లేపు, హరీ! మహి చదరంగం బాగా ఆడుతుందిరా, కావాలంటే ఆడుకోండి"

మహి చదరంగ బలాలు సర్దుతూ హరికేసి చూసింది. "రేపెళ్ళి పోతున్నారా?" హరి తలూపాడు "ఢిల్లీలో ఏం పని మీకు?" మహి ఎత్తు వేసింది.

"బిజినెస్ – బాబయ్యగారిది మేనేజ్ చేస్తాను." హరీ ఎత్తు వేసాడు. ఇద్దరూ మాటలాపేసి ఆటమీదే దృష్టి నిలిపారు. మహి నిజంగానే మంచి ప్లేయర్–జాగ్రత్తగా ఆడేరకం. హరి రాష్. డేర్ డెవిల్ ఎత్తులు వేసే ఆటగాడు. మూడవుతుంటే బలాలు కలిపేసారు నాలుగాటల తర్వాత మూడింటిని హరి గెలిచాడు. 'మహి సుపీరియర్ ప్లేయర్ అయినా మహి కావాలని చాలా తప్పులు చిన్నచిన్నవి చేసింది. హరి కది తెలియలేదు.

ఇంతలో ఫోన్ మోగింది. మహి రిసీవర్‌ని అందుకుంది. "హల్లో ... పిలుస్తానుండండి ..." రిసీవర్‌ని చేత్తో మూస్తూ అంది "మీకే".

మహి చేతుల్లోంచి రిసీవర్‌ని అందుకుంటుంటే ఆమె వేళ్లు తగిలి ఉలిక్కిపడ్డాడు హరి. ఒక అమ్మాయి స్పర్శకి తన నరాలలాగ స్పందించి చాలా రోజులయింది...యిన్‌ఫాక్ట్– కొన్నేళ్లు అయింది...

రెండు నిమిషాలలో ఫోన్ పెట్టేసి మహికేసి తిరిగాడు. "నాకేదో టెలిగ్రామ్ వచ్చిందట, నేవెళ్ళి పోతున్నాను..." అన్నాడు.

"రాజుని లేపుతానుండండి ..." మహిని వారిస్తూ అన్నాడు హరి – "వాడి నిద్ర నాకు తెలుసు–లేపకండి–నేను..."

"పోనీ టీ తాగి వెళ్దురుగాని. అయిదు నిముషాల్లో పెడతాను ..." వద్దన్నాడు హరి...గుమ్మంవైపు కదిలాడు...మహి కూడా నడిచింది ... "మళ్ళీ ఎపుడొస్తారు మద్రాసు?" అంది.

"ఏమో. మహీ – నన్ను గుర్తుంచుకుంటారా మీరు?" హరి కంఠం గంభీరంగా అయింది... మహి మౌనంగా తలాపింది.

"ప్రామిస్?" చిర్నవ్వుతో అడిగాడుహరి.

"ప్రామిస్" చాచిన హరి చేతిలో తన చేతి నుంచింది మహి "థాంక్స్" మహి చేతిని మృదువుగా నొక్కి వెళ్లిపోయాడుహరి.

హరి వెళ్లిపోయి చాలసేపయ్యాక కూడా మహి తన చేతిని వింతగా చూసుకుంటూ గుమ్మందగ్గరే నిలబడి పోయింది * *

ఢిల్లీలో కాలు పెట్టిన మరుక్షణం మహీ-ఆమె ప్రామిస్‌నీ హరిమరచిపోయాడు. [illegible] బిజినెస్ గొడవలూ, సాయంత్రాలు [illegible] ఎఫైర్స్ – అతనికి

మద్రాసుని గుర్తు చేసుకునేంత తీరిక లేదు—రాత్రిళ్ళు కలల్లో దూరంగా కనిపించే— వింత పేరుగల లేత నీలం గరారా అమ్మాయిరూపం అతనికి తెల్లవారగానే దూరమయింది.

జూన్‌లో — మృణాళిని అమెరికన్ ప్రొఫెసరుతో వెళ్ళిపోయింది — "నీకర్థమవుతుంది కదూ హరీ — నాకు నువ్వంటే యిష్టమే — కాని— అతను మిలియనీరు." అంది సింపిల్‌గా. హరికి అర్థమయింది. సుడిగాలి లాంటి ప్రేమ వ్యవహారం అంతమయిపోయింది. మృణాళిని స్వభావమే అంత అని హరికి తెలును. చీకాకుగా తోచింది జీవితం. మనశ్శాంతి కోసం మద్రాసు ట్రిప్ పెట్టుకున్నాడు...

తలుపు తెరిచిన మహీ కేసి మొదటిసారిగా చూస్తున్నట్లు చూసాడు హరి... పాలిపోయిన మొహం... కళ్ళకింద నీలినీడలు... చిక్కిపోయింది. ఈ ఆర్నెల్లలో వొంట్లో బాగుండ లేదా ?

తనకేసి చూపిన మొహంలో విచారం — కళ్ళల్లో నిరాసక్తి — నిరాశ — గులాబీరంగు 'ఎలిఫెంటాలలో' చిక్కిపోయిన మహీ చాలా అందంగా వుంది. వెనక్కి తిరిగి లోపలికి దారితీస్తున్న మహీ మెడదగ్గర నుంచీ — ఎర్రబడిపోయాయి...హరి అది గమనించాడు..

నిశ్శబ్దంగా వొకరి నొకరు చూసుకున్నారు... హరికి యిన్నాళ్ళకీ తన జీవితానికో గమ్యం దొరికినట్టయింది. యిన్నాళ్ళు ఏందుకు తెలియలేదా అనిపించింది— ఆర్నెల్లు వృధా చేసినందుకు తనమీద తనకే కోపం వచ్చింది. ఇప్పటికైనా తెలిసినందుకు ఆనందమనిపించింది. మహి కిచెన్‌లోకి వెళ్ళిపోయింది...

హరికి మృణాళినీ — బిజినెస్‌లో సమస్యలు, అన్నీ దూరమయిపోయాయి. మహీ అన్న పేరు ఉచ్చరించడానికి హరిలోని ప్రత్యణువూ తపించి పోతోంది. చాలా సంవత్సరాల తర్వాత— ఒక అమ్మాయిని తాకడానికీ — పిలవడానికి — యింత బాధపడ్డాడు హరి... ఈ ఆర్నెల్లలో అసలు మహిని తలచలేదనే ఆలోచన హరికి ఆశ్చర్యమనిపించలేదు. రాత్రిళ్ళు కలల్లో కన్పించడమూ ఆశ్చర్యమన్పించలేదు. తన లాంటి రాతిని—యింత విచిత్రంగా కదిలించగల శక్తి మహి కెలా కలిగిందా అన్న ఆశ్చర్యమూ కలగలేదు — ఇదంతా ముందే ఇలా జరుగుతుందని తెలిసినట్లు — ఇలాగే జరగాలని విధి శాసించినట్టు తోచింది.

కాఫీ అందిస్తున్న మహి చేతులు వణకడం తృప్తితో గమనించాడు హరి. ఒక చేత్తో కప్పు అందుకుని, టేబిలు మీద పెడుతూ రెండో చేత్తో మహి చేతులని పట్టుకున్నాడు.

హరి గుప్పెటలోని మహి చేతులు వణుకుతున్నాయి- మహి కళ్ళలోని భావాల్ని చదివాడు హరి. ఆ ముక్కున మెరిసిన ముక్కు పుడకని, వణుకుతున్న పెదవుల్ని నొక్కిపెడుతున్న పంటిని పరిశీలించాడు.

"మహీ—ఐ హావ్ కమ్‌బాక్" ఆవేశంతో బొంగురు పోయింది హరి కంఠం.

మహి తలూపింది.

"మహీ—మహీ" .యింకో మాట రాలేదు హరినోట. మహి చేతుల్ని ముద్దు పెట్టుకుంటూ, ఆమె పేరుని వుచ్చరిస్తూ హరి—తను వెతుకుతున్న మనశ్శాంతిని పొందాడు—తుఫానుని క్షణాల్లో తప్పించుకుని. రేవుచేరిన నావ లాగుంది అతని మనసు.

"మహీ—ఐ లవ్‌యూ" అన్నాడు చాలా సేపయ్యాక. మహి హరి మెడ చుట్టు వున్న తన చేతుల్ని తీసే ప్రయత్నం చెయ్యలేదు—హరి భుజంలో మొహం దాచుకుని ఈ నిజాన్ని కల కాదని నమ్మించే ప్రయత్నం చేసింది.

ఈ ఆర్నెల్లూ—ప్రతిరోజూ, ప్రతిక్షణమూ హరిని తల్చుకుని, హరి తనని మరిచి పోయాడని బాధపడి, హరిని ఆధునాతనంగా ఉన్న అమ్మాయిల చేతులలో ఊహించుకొని తనని తను చిత్రవధ చేసుకుంది పెళ్ళి వచ్చినపుడు—హరి పేరు కలవరించి—అన్నగారికి దొరికిపోయింది.

రాజు గంభీరంగా అన్న మాటలు గుర్తుకొచ్చాయి. "మహీ—హరి మంచివాడే—కాని అనుభవమున్నవాడు—ఒక అమ్మాయితో స్థిరపడే రకంకాదు—నువ్వింకా చాలా చిన్నపిల్లవి—నీ ముందర చాలా జీవితం పరుచుకుని వుంది. హరికంటే అందమైన వాళ్ళు చాలా మంది వున్నారు. హరిని మరిచిపోమ్మా నిజంగా ప్రేమలో పడే వయసు కాదు నీది..."

తర్వాత మహి కోసం పార్టీలు యివ్వసాగాడు రాజు. ఎందరెందరో అబ్బాయిలు — రెండుసార్లు డేటింగ్ ప్రయత్నించింది—ప్రతి అబ్బాయీ అతడి కాంప్లిమెంట్లు — మహి హృదయంలోని హరి రూపాన్ని మరింత బలంగా ముద్రించారు—లోకమంతా హరి—హరి—హరిగా — యింకో ప్రపంచమే లేకుండా పోయింది—ఇపుడు—ఇపుడేమో—ఇది

"ఈ ఆర్నెల్లలో నేను గుర్తుకొచ్చానా మీకు?" మహి మృదువుగా అడిగింది — హరి భుజం మీది తలని తియ్యకుండా "ప్రతిరాత్రి కల్లో కొచ్చేదానివి" నిజం చెప్పాడు హరి. "మహీ—నన్ను పెళ్ళి చేసుకుంటావా ?"

మహి బుగ్గ లెర్రబడాయి. "అన్నయ్య నడగండి" అంది.

వెనక్కి తిరిగి వెళ్ళిపోబోయిన రాజు — "ఏమిటి నన్నడగడం?" అన్నాడు. మహి హరి చేతుల్ని విడిపించుకో బోయింది. హరి వదల్లేదు. "మా పెళ్ళికి పర్మిషను"అన్నాడు మహి గడ్డంమీద తలాన్చుకుని రాజు కేసి చూస్తూ.

"ఇచ్చేశాను." రాజు వెళ్ళిపోయాడు "ఐదు నిముషాలు టైమిస్తున్నాను" అంటూ "థాంక్స్ రాజూ." అనేసి — వంగి మహిని ముద్దు పెట్టుకున్నాడు హరి. "మహీ ! ఐ హావ్ కమ్ హోమ్. నే తిరిగి వచ్చాశానోచ్" అన్నాడు — మహి చెవిలో.

"వెల్కమ్ హోమ్" అంది మహి. వంగి మెడచుట్టూరా తిరిగేలా చేతులు చాచుతూ!

*

## ఫౌంటెన్ పెన్ సిరా

సిరా తయారు చేయుటానికి కావలసిన వస్తువులు.

ఇండిగో కార్మిను రంగు ½ అవున్సు, ఫెర్రసు సల్ఫేటు 1½ అవున్సులు, అమ్లా 9 అవున్సులు, సల్ఫ్యూరికామ్లము 25 చుక్కలు, నీరు 40 అవున్సులు, లవంగ చూర్ణము 1 డ్రాము

తయారుచేయు విధానము.-అమ్లా, లవంగ చూర్ణమును ఒక పాత్రలో వేసి 40 అవున్సుల నీటిని దాంట్లో పోసి కలపాలి. ఈ ద్రవాన్ని జాగ్రత్తగ ఇంకొకపాత్ర లోనికి వడపోయాలి. ఈ వడపోసిన ద్రావణమునకు 1½ అవున్సుల ఫెర్రసు సల్ఫేటు ద్రావణమును పోసి బాగ కలియపెట్టాలి. కొన్ని నిమిషములు అయిన తరువాత 25 చుక్కల సల్ఫ్యూరికామ్లమును చుక్కలు చుక్కలుగ ఈ ద్రావణములో పోసి కలియపెట్టాలి. చివరకు ½ అవున్సు ఇండిగో కార్మిను రంగు కలిపి రెండు మూడువారాలు తలుపకుండా మూతవేసి ఉంచాలి. తరువాత ఆ ద్రావణమును వడబోసినచో నిర్మలమైన సిరా వస్తుంది.

ఇ. శివుడు.